మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
PRGI REGD NO: TGTEL/25/A1385
Circulated to Telangana
Published from Jagitial
NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 20-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 21 Issue: 21

20 జూలై 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:55 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి సప్తమి తె. 4:04ం వరకు తరువాత అష్టమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం హస్త రా. 7:09 వరకు తరువాత చిత్తా యోగం శివ సా. 6:34 వరకు కరణం గరజి మ. 3:46 వరకు వనిజ తె. 4:04ం వరకు వర్జ్యం తె. 3:42 నుండి తె. 5:25 వరకు దుర్ముహూర్తం మ. 12:48 నుండి మ. 1:39 వరకు మ. 3:23 నుండి సా. 4:14 వరకు రాహుకాలం ఉ. 7:32 నుండి ఉ. 9:08 వరకు యమగండం ఉ. 10:45 నుండి మ. 12:22 వరకు గుళికాకాలం మ. 1:59 నుండి మ. 3:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:19 నుండి తె. 5:07 వరకు అమృత ఘడియలు మ. 12:54 నుండి మ. 2:34 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## సింధూ నయా హిస్టరీ

భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ కైవసం చేసుకుని అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో ఆతిథ్య జపాన్‌కు చెందిన ప్రపంచ స్టార్ ప్లేయర్ అకానే యమగుచిపై సింధు వరుస గేముల్లో ఘన విజయం సాధించింది.



## విశ్వ విజేతగా స్పెయిన్

ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులను ఉత్కంఠకు గురిచేస్తూ సాగిన 2026 ఫిఫా వరల్డ్ కప్‌కు ఆదివారం ఘన ముగింపు పలికింది. అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన ఫైనల్ పోరులో స్పెయిన్ అద్భుత పోరాట పటిమతో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను 1-0తో మట్టికరిపించి ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడింది. తొలి విజిల్ నుంచి చివరి క్షణం వరకు ఇరు జట్లు హోరాహోరీగా తలపడగా, స్పెయిన్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విజేతగా నిలిచింది. 2010లో తొలిసారి ప్రపంచకప్‌ను గెలిచిన స్పెయిన్, 16 ఏళ్ల విరామం తర్వాత మరోసారి ప్రపంచ విజేతగా అవతరించి తన ఫుట్‌బాల్ వారసత్వాన్ని మరింత బలోపేతం చేసింది. మరోవైపు వరుసగా రెండోసారి కప్‌ను కైవసం చేసుకోవాలన్న అర్జెంటీనా ఆశలు ఫైనల్లోనే ఆవిరయ్యాయి.

# పార్లమెంట్ సమరం..
# నేటి నుంచే

## బిల్లుల వేడి, విపక్షాల వ్యూహాలతో రసవత్తరంగా సమావేశాలు!



దేశవ్యాప్తంగా రాజకీయ ఉత్కంఠ రేపుతున్న పార్లమెంట్ ప్రతిష్ఠాత్మక సమావేశాలు నేటి నుంచే ప్రారంభం కానున్నాయి. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన అత్యంత కీలకమైన బిల్లును అధికారిక ఎజెండాలో ఇంకా చేర్చకపోయినప్పటికీ, ఈ ప్రతిష్ఠాత్మక బిల్లుపై అవసరమైన సంఖ్యాబలాన్ని కూడగట్టేందుకు అధికార కూటమి అన్ని రకాలుగా పావులు కదుపుతోంది. మరోవైపు ఈ బిల్లును గట్టిగా తిప్పికొట్టాలని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సన్నద్ధమవుతోంది.

### మహిళా రిజర్వేషన్లపై అధికార కూటమి నజర్

### పేపర్ లీకేజీలు, అయోధ్య విరాళాల చోరీపై నిలదీసేందుకు విపక్షాల సిద్ధం

### అఖిలపక్ష భేటీ నుంచి విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ, జులై 19: ఈ విడత సమావేశాల్లో విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ బిల్లు, 'వికసిత భారత్ శిక్షా అధిష్ఠాన్' బిల్లు వంటి అనేక కీలక బిల్లులు ఉభయ సభల ముందుకు చర్చకు రానున్నాయి. సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలోనే పార్లమెంట్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. 'ఇండియా' కూటమితో ఇప్పటికే తెగదెంపులు చేసుకున్న డీఎంకే, తమ పార్టీ సభ్యులకు సభలో విడిగా సీట్లు కేటాయించాలని కోరింది. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయి, కొత్తగా ఏర్పాటైన 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో చేరినట్లు ప్రకటించిన 20 మంది ఎంపీల విడిగా కూర్చునే అభ్యర్థనను లోక్‌సభ స్పీకర్ ఆమోదించారు. అయితే, సాంకేతికంగా వారిని ఆ కొత్త పార్టీ భాగంగానే గుర్తించాలన్న వినతిపై స్పీకర్ నుంచి తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.

ఇక వివిధ ప్రజాసమస్యలు, వివాదాస్పద అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు విపక్షాలు వ్యూహప్రతివ్యూహాలతో సిద్ధమయ్యాయి. దేశాన్ని కుదిపేసిన ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ప్రతిపక్షం తరువాయి 2 వ పేజీలో..



3

## నేడే పార్లమెంట్ మార్చ్


విజయవంతం చేయాలని వాంగ్‌చుక్ పిలుపు

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,253 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,151 |

## విశ్వవాణి



2019లో అమెరికాలోని నార్త్ కరోలినాకు చెందిన ఆరోన్ స్మిత్ సింగ్యులారిటీ అనే వినూత్నమైన, వ్యంగ్యాత్మక డేటింగ్ యాప్‌ను రూపొందించాడు. ఈ యాప్‌లో పురుషులుగా ఎవరూ ఉండరు – అతనొక్కడే ఉంటాడు. యాప్‌లో చేరిన మహిళలు ఎంతసేపు స్వైప్ చేసినా, వారికి కనిపించేది వివిధ ఫోటోలు, భిన్నమైన ప్రొఫైల్ వివరాలతో ఉన్న ఆరోన్ స్మిత్ మాత్రమే. అంటే యాప్‌లో ఉన్న ఏకైక వరుడు అతడే. ఈ యాప్‌ను తాను సరదాగా క్రియేట్ చేశానని చెప్పుకొచ్చాడీ ప్రబుద్ధుడు.



2

## 21న హాకీంపేటలో రేవంత్ పర్యటన

### పారిశ్రామిక జోన్ పనులపై ప్రత్యేక సమీక్ష

### క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 21న తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ లో పర్యటించనున్నారు. దుద్యాల మండలం హాకీంపేటలో సీఎం పర్యటన ఖరారు కావడంతో స్థానిక అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ పర్యటనకు సంబంధించి ఆదివారం ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి డీఈ సురేందర్, దుద్యాల తహసీల్దార్ తో పాటు కొడంగల్ సీఐ, ఎస్ఐ తదితర అధికారులు ముందస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



2

## రైతులకే తొలి ప్రాధాన్యత

### నాణ్యమైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం

### ఇల్లెందు పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఇల్లెందు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కామేపల్లి మండలం మద్దులపల్లి, ఇల్లెందు మండలం రొంపేడు, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు వద్ద 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



2

## ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

### కోరుట్లలో టీఆర్ఎస్ సంకల్ప సభ.. ప్రభుత్వంపై కవిత తీవ్ర విమర్శలు

కోరుట్లలో నిర్వహించిన టీఆర్ఎస్ పాంచజన్య సంకల్ప సభలో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ భాజపా సీనియర్ నేత డాక్టర్ రఘుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి కవిత ఆహ్వానం పలికారు. సభలో మాట్లాడిన కవిత సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శించారు.



2

## ఇది రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు!

### కాళేశ్వరం నీళ్ల కోసం కదంతొక్కిన రైతులు

### రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

కాళేశ్వరం నీళ్ల కోసం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల రైతులు స్వచ్ఛందంగా కదంతొక్కారు. రంగనాయక సాగర్ నింపాలని డిమాండ్ చేస్తూ రైతులు పదిహేను కిలోమీటర్ల మేర మహా పాదయాత్ర నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన ఈ యాత్ర మధ్యాహ్నం మూడు గంటలకల్లా ముగిసింది.

## రాశి ఫలాలు

20.7.2026

**మేషం :** పట్టుదలతో పనిచేసి అనుకున్నది సాధిస్తారు. కొన్ని పరిస్థితులు మనోవిచారాన్ని కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. హనుమాన్ చాలీసా పఠిస్తే మంచి ఫలితాలు కలుగుతాయి.

**వృషభం :** కీలక విషయాల్లో దిగ్విజయంగా ముందుకెళ్తారు. వృత్తి, వ్యాపార రంగాల్లో మీకు అనుకూలంగా కొన్ని నిర్ణయాలు మారతాయి. ఆనందించే సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఇష్టదైవ స్తుతి మంచిది.

**మిథునం :** ఉద్యోగంలో కార్యసిద్ధి ఉంది. స్నేహపూర్వక వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల మాటలకు గౌరవం ఇస్తూ ముందుకెళ్లండి. శుభం జరుగుతుంది. ఆంజనేయ స్వామి సందర్శనం శుభప్రదం.

**కర్కాటకం :** చేపట్టే పనులకు ఆటంకం కలగకుండా చూసుకోవాలి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. కొన్ని సంఘటనల్లో ఆటంకాలు ఎదురైనా అధైర్యపడకుండా ముందుకు సాగితే మేలైన ఫలితాలు లభిస్తాయి. దుర్గాస్తుతి శుభదాయకం.

**సింహం :** చేపట్టిన పనులలో పురోగతి ఉంటుంది. మానసికంగా దృఢంగా ఉంటారు. సంతృప్తికర ఫలితాలను రాబట్టడానికి ఇది సరైన సమయం. సౌభాగ్య సిద్ధి ఉంది. ఇష్టదేవత స్తోత్ర పఠనం శుభప్రదం.

**కన్య :** మీ మీ రంగాల్లో కార్యజయం ఉంది. కీర్తి వృద్ధి చెందుతుంది. బంధువుల ఆదరాభిమానాలుంటాయి. అర్థలాభం ఉంది. ఆంజనేయ స్వామి ఆరాధన శుభదాయకం.

**తుల :** తలపెట్టిన కార్యాల్లో విజయసిద్ధి ఉంది. ఒక శుభవార్త ఉత్సాహాన్నిస్తుంది. విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. తోటివారి సహాయ సహకారాలున్నాయి. దైవబలం రక్షిస్తోంది. శ్రీ వేంకటేశ్వర స్వామి సందర్శనం శుభప్రదం.

**వృశ్చికం :** మీ మీ రంగాల్లో సందర్భానుసారంగా ముందుకు సాగితే శుభఫలితాలు అందుకుంటారు. మీ పట్టుదలే మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. అనవసర విషయాల్లో తలదూర్చకండి. లక్ష్మీ ధ్యానం మంచినిస్తుంది.

**ధనుస్సు :** శ్రమకు తగిన ఫలితాలుంటాయి. ఉద్యోగంలో ఉన్నతాధికారులతో నమ్రతగా వ్యవహరించాలి. గిట్టనివారు మీ ఉత్సాహంపై నీళ్లు చల్లుతారు. మనోవిచారం కలిగించే ఘటనలకు దూరంగా ఉండాలి. సూర్య స్తుతి మేలుచేస్తుంది.

**మకరం :** ప్రశాంతమైన ఆలోచనలతో గొప్పవారవుతారు. సమర్థతను పెంచాలి. కీలక విషయాల్లో బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి. శుభఫలితాలు పొందడానికి వేంకటేశ్వర స్వామిని సందర్శించాలి.

**కుంభం :** లక్ష్యాలకు కట్టుబడి పనిచేయాలి. ధర్మ సందేహాలతో కాలా న్ని వృథా చేయకండి. కుటుంబ సభ్యులతో ఆచితూచి వ్యవహరించాలి. మనో విచారం కలగకుండా చూసుకోవాలి. ప్రయా ణంలో ఆటంకాలు కలుగుతాయి. శివారాధన శుభప్రదం.

**మీనం :** చేపట్టే పనుల్లో విజయం సాధిస్తారు. కొన్ని సందర్భాల్లో లౌక్యంగా వ్యవహరించి సమస్యలను అధిగమిస్తారు. భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగండి. గణపతి ఆరాధన శుభప్రదం.

# పార్లమెంట్ సమరం నేటి నుంచే

మొదటి పేజీ తరువాయి

గట్టిగా పట్టుబట్టనుంది. అలాగే, అయోధ్యలో విరాళాల చోరీ అంశంపై పార్లమెంటును స్తంభింపజేస్తామని సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే ప్రకటించడంతో సభలో తీవ్ర దుమారం రేగడం ఖాయంగా కనిపిస్తోంది. వీటితో పాటు పెట్రోలులో ఇథనాల్ కలపడం, దేశ విదేశాంగ విధానం వంటి కీలక అంశాలు కూడా ఈ విడత సమావేశాలను ఉడికించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఆదివారం న్యూఢిల్లీలో నిర్వహించిన సాంప్రదాయ అఖిలపక్ష సమావేశం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది.

సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (యూబీటీ), ఆమ్‌ఆద్మీ, మరియు వామపక్ష పార్టీలకు చెందిన ప్రతిపక్ష నేతలు సభ నుండి వాకౌట్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయిన 20 మంది తిరుగుబాటు ఎంపీలను ఈ సమావేశానికి ఆహ్వానించడంపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి.

ఈ విలీనానికి స్పీకర్ ఇంకా అధికారిక ఆమోదం తెలపలేదని, టేబుల్ ఆఫీస్ రికార్డుల ప్రకారం తమ బలం 28 మందిగానే ఉందని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా స్పష్టం చేయగా, రాజ్యాంగ రక్షణ కోసమే తాము వాకౌట్ చేశామని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ పేర్కొన్నారు. మరోవైపు, పార్లమెంట్ సమావేశాలను సజావుగా నడిపేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, అర్జున్ రామ్ మేఘవాల్‌లతో పాటు తెలుగు రాష్ట్రాల ప్రతినిధులుగా లావు శ్రీకృష్ణదేవరాయలు (టీడీపీ), బాలశౌరి (జనసేన), మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి (వైసీపీ), వద్దిరాజు రవిచంద్ర (బీఆర్ఎస్) తదితరులు పాల్గొన్నారు.

# ఇది రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు!

### కాళేశ్వరం నీళ్ల కోసం కదంతొక్కిన రైతులు

### సీఎం రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు ఫైర్

సిద్దిపేట, జూలై 19: కాళేశ్వరం నీళ్ల కోసం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల రైతులు స్వచ్ఛందంగా కదంతొక్కారు. రంగనాయక సాగర్ నింపాలని డిమాండ్ చేస్తూ రైతులు పదిహేను కిలోమీటర్ల మేర మహా పాదయాత్ర నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన ఈ యాత్ర మధ్యాహ్నం మూడు గంటలకల్లా ముగిసింది. ఇది బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన యాత్ర కాదని, కేవలం చిన్నకోడూరు రైతులు కరువు నుంచి కాపాడుకునేందుకు స్వచ్ఛందంగా చేపట్టిన కార్యక్రమమని, వారి ఆహ్వానం మేరకే తాను హాజరయ్యానని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇప్పుడున్న కరువు ప్రకృతి తెచ్చింది కాదని, అది కాంగ్రెస్ మరియు రేవంత్ రెడ్డి తెచ్చిన కరువేనని ఆయన విమర్శించారు. కేసీఆర్ కు ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న పగ, ప్రతీకారంతోనే రేవంత్ రెడ్డి కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ ను తిడితే ముఖ్యమంత్రి ఆనందపడొచ్చు కానీ, నీళ్లు లేక రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ను తిట్టడం మానేసి వెంటనే మోటార్లు వేసి నీళ్లు ఇవ్వాలని హితవు పలికారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీళ్లను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలేస్తుంటే, పక్క రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పట్టిసీమ మోటార్లు ఆన్ చేసి వాడుకుంటున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. 70 టీఎంసీల నీళ్లను వృథాగా ఆంధ్రాకు వదిలేశారని, అదే నీటిని ఎత్తిపోస్తే ఈపాటికి రంగనాయక సాగర్ నిండుగా ఉండేదని వివరించారు. నీళ్లు లేక రంగనాయక సాగర్ లో రాళ్లు, చెట్లు కనిపిస్తూ చిన్నబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రాజెక్టుల నిర్వహణలో విఫలం: కవిత

**కోరుట్ల, జూలై 19**

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై కూడా కవిత స్పందించారు. మేడిగడ్డతో సంబంధం లేకుండానే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ అవకాశాన్ని వినియోగించుకోవడం లేదని అన్నారు. ప్రజలు ఏ సమస్యను ప్రస్తావించినా ప్రభుత్వం సమాధానం చెప్పకుండా ఎదురుదాడి చేస్తోందని విమర్శించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో అవినీతి, బీసీల సమస్యలపై అంతర్గతంగా ప్రశ్నించానని, ఆ కారణంగానే తనపై కుట్ర చేసి పార్టీ నుంచి పంపించారని కవిత అన్నారు. ప్రజల అస్తిత్వం, సామాజిక న్యాయం కోసం టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశానని తెలిపారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడమే పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, రైతులకు ప్రత్యేక సేవలు, అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పిస్తామని కవిత హామీ ఇచ్చారు. అవినీతిని అరికడితే ప్రస్తుతం ఉన్న బడ్జెట్‌తోనే ఈ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం సాధ్యమవుతుందని కవిత అభిప్రాయపడ్డారు.

# 21న హాకీంపేటలో సీఎం రేవంత్ పర్యటన

### పారిశ్రామిక జోన్ పనులపై ప్రత్యేక సమీక్ష

### క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు




కొడంగల్, జూలై 19: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 21న తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ లో పర్యటించనున్నారు. దుద్యాల మండలం హాకీంపేటలో సీఎం పర్యటన ఖరారు కావడంతో స్థానిక అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ పర్యటనకు సంబంధించి ఆదివారం ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి డీఈ సురేందర్, దుద్యాల తహసీల్దార్ తో పాటు కొడంగల్ సీఐ, ఎస్ఐ తదితర అధికారులు ముందస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలు, హెలిప్యాడ్ ఏర్పాటు, సమీక్షా సమావేశం నిర్వహించే ప్రాంగణాలను వారు నిశితంగా పరిశీలించి సిబ్బందికి తగిన దిశానిర్దేశం చేశారు.

**అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా**

హాకీంపేట పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న పలు కీలక అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. అనంతరం జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో అక్కడే ఆయన ఒక సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. హాకీంపేట, లగచర్ల, పోలేపల్లి గ్రామాల్లో ప్రతిపాదించిన పారిశ్రామిక జోన్ పనులు, దానికి సంబంధించిన భూసేకరణ పురోగతిపై ఆయన ప్రత్యేక దృష్టి సారించనున్నారు. స్థానికంగా మౌలిక వసతుల కల్పన, నియోజకవర్గానికి కొత్తగా మంజూరైన రహదారులు, పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేయనున్నారు.

దుద్యాల మండలంలో ప్రజా సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు ఏ విధంగా అందుతున్నాయనే విషయమై ముఖ్యమంత్రి ఆరా తీయనున్నారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పోలీసు శాఖ పటిష్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. మరోవైపు తమ నేత రాకను పురస్కరించుకుని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనను అత్యంత విజయవంతం చేసేందుకు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.



# రైతులకే తొలి ప్రాధాన్యత

### నాణ్యమైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం

### ఇల్లెందు పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఇల్లెందు, జూలై 19: రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఇల్లెందు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కామేపల్లి మండలం మద్దులపల్లి, ఇల్లెందు మండలం రొంపేడు, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు వద్ద 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, ప్రస్తుతం డిమాండ్ 16 వేల మెగావాట్లకు చేరిందని ఆయన వివరించారు. డిమాండ్ పెరిగినా వ్యవసాయ, గృహ, పారిశ్రామిక రంగాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించేందుకు డివిజన్ల వారీగా 160 ప్రత్యేక వాహనాలను అందుబాటులోకి తెచ్చామని, ఏవైనా సమస్యలు ఉంటే 1912 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు ఉన్న ఏజెన్సీ ప్రాంత గిరిజన పోడు సాగుదారుల కోసం ప్రత్యేకంగా ఇందిరా సౌర గిరి జల వికాసం అనే కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. గిరిజన ఉప ప్రణాళిక నిధులతో అమలు చేసే ఈ పథకం కింద బోర్ బావులు, పంపుసెట్లు, వ్యవసాయ పరికరాలను అందజేస్తామని ఆయన తెలిపారు. దీనివల్ల గిరిజన రైతుల ఆత్మగౌరవంతో పాటు వారి ఆదాయం కూడా పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సింధూ నయా హిస్టరీ

### ఫైనల్లో జపాన్ స్టార్ ప్లేయర్ ..

### యమగుచిపై వరుస గేముల్లో విజయం

టోక్యో, జులై 19: భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ కైవసం చేసుకుని అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో ఆతిథ్య జపాన్‌కు చెందిన ప్రపంచ స్టార్ ప్లేయర్ అకానే యమగుచిపై సింధు వరుస గేముల్లో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే అద్భుతమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించిన సింధు.. 21-17, 21-17 తేడాతో యమగుచిని మట్టికరిపించింది. ప్రతి గేము చివరి వరకు ఇరు ఆటగాళ్ల మధ్య హోరాహోరీగా సాగినప్పటికీ, ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా కేవలం 50 నిమిషాల్లోనే సింధు మ్యాచ్‌ను ముగించి టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ కీలక ఫైనల్ మ్యాచ్‌కు ముందు యమగుచిపై సింధుకు ఈ ఏడాది పెద్దగా సానుకూల రికార్డేమీ లేదు. 2026లో ఈ ఫైనల్‌కు ముందు ఇరు దేశాల ఆటగాళ్లు మూడుసార్లు ముఖాముఖి తలపడగా, అందులో రెండుసార్లు యమగుచినే విజయం సాధించింది. థాయ్‌లాండ్ ఓపెన్ క్వార్టర్స్‌తో పాటు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఈ జపాన్ క్రీడాకారిణిదే పైచేయి కాగా, కేవలం మలేషియా ఓపెన్‌లో మాత్రమే యమగుచి మధ్యలోనే రిటైర్డ్ హర్ట్‌గా వెళ్లడంతో సింధుకు విజయం దక్కింది. ఈ ప్రతికూల గణాంకాల వల్ల ఫైనల్లో సింధుపై కాస్త ఒత్తిడి ఉన్నప్పటికీ, మైదానంలో ఆమె ఎక్కడా ఆ ఒత్తిడిని కనబరచలేదు.

# నేడే పార్లమెంట్ మార్చ్


న్యూఢిల్లీ, జులై 19: దిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా 21 రోజులుగా పర్యావరణ ఉద్యమకా రుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేసిన నేపథ్యంలో, ఆయన పిలుపు మేరకు 'పార్లమెంట్ మార్చ్' నిరసన ర్యాలీ సోమవారం జరగనుంది. తనను ఆస్పత్రిలో అక్రమంగా నిర్బంధించారని ఆక్షేపించిన వాంగ్‌చుక్.. నిర్భయమైన భారత్ సాకారం కోసం, అన్యా యం నుంచి విముక్తి కోసం కాక్రోచ్ జనతా పార్టీ నేడు చేపట్టదలచిన ఈ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని తన మద్దతుదారులను కోరారు. తెల్లకాగితంపై ఆయన స్వయంగా రాసిన ఈ సందేశాన్ని భార్య గీతాంజలి ఆయన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, ప్రస్తుతం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్నందున భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు ఈ పార్లమెంట్ మార్చ్‌కు అనుమతి నిరాకరించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే, దీర్ఘకాలం పాటు ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలో చిన్నపాటి సమస్యలు తలెత్తినప్పటికీ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని, నిపుణులైన వైద్యుల బృందం ఆయన్ను నిశితంగా పరిశీలిస్తోందని ఆస్పత్రి యాజమాన్యం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది.

# జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్లు

## ఎల్‌నినో ఎఫెక్ట్..

### అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం

**క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించి ముఖ్యమంత్రికి నివేదిక**



హైదరాబాద్, జూలై 19: రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తలెత్తే కరువు, తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సాగు, తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నివారించేందుకు 10 ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రిజర్వాయర్లలో నీటి మట్టాలు, భూగర్భ జలాలు, తాగునీటి లభ్యత, వ్యవసాయం, ఉద్యానవన పంటల పరిస్థితితో పాటు విద్యుత్ సరఫరాపై ఈ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నారు.

ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారు ఇవాళ్టి నుంచి తమకు కేటాయించిన ఉమ్మడి జిల్లాల్లో పర్యటించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ఇంచార్జి మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో వీరు విస్తృత సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లాల పర్యటన అనంతరం రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ అధికారులు తమ సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి నేరుగా అందించనున్నారు.

**జిల్లాల వారీగా బాధ్యతలు ఇలా**

ఉమ్మడి జిల్లాల వారీగా నియమితులైన ప్రత్యేక అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కు జయేష్ రంజన్, రంగారెడ్డికి వికాస్ రాజ్, కరీంనగర్ కు మహేష్ దత్ ఎక్కా, మెదక్ కు వాణీ ప్రసాద్, నిజామాబాద్ కు యోగితా రాణా బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే నల్లగొండకు హరిచందన దాసరి, ఆదిలాబాద్ కు ఇలంబర్తి, వరంగల్ కు శ్రీదేవసేన, మహబూబ్ నగర్ కు వీపీ గౌతమ్, ఖమ్మం జిల్లాకు అనుదీప్ దురిశెట్టిలను ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా నియమించింది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల కృతజ్ఞతలు

**11 వేల కుటుంబాలకు భద్రత కల్పనపై హర్షాతిరేకాలు**

**విశాఖలో ఓపీఎస్ ఉద్యోగుల కృతజ్ఞతాభివందన సభ**

**సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఉద్యోగుల పాలాభిషేకం**

విశాఖపట్నం, జూలై 19: సీపీఎస్ విధానం నుంచి ఓపీఎస్ కు మారిన ఉత్తరాంధ్ర జిల్లాల ఉద్యోగులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఏపీ డీఎస్సీ ఫోరం, పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ కృతజ్ఞతాభివందన సభకు సుమారు 15 వేల మంది హాజరై సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వేలాది మంది చిరకాల ఆకాంక్షను నెరవేర్చి పాత పెన్షన్ అమలు చేసినందుకు థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఈ సభలో శాసనమండలి ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ, పాత పెన్షన్ విధానంతో రాష్ట్రంలోని 11 వేల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భద్రత కల్పించిందని హర్షం వ్యక్తం చేశారు. 2004 నోటిఫికేషన్ ద్వారా ఎంపికై సాంకేతిక కారణాలతో ఆలస్యంగా చేరిన వారికి ఓపీఎస్, గ్రాట్యుటీ ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనని, గత ప్రభుత్వంలో డీఏలు రాక ఎంతో ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. ఉపాధ్యాయులను గత పాలకులు మద్యం దుకాణాల వద్ద క్యూలైన్లకు వాడుకుని ఘోరంగా అవమానించారని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**ఉద్యోగుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం**

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర అభివృద్ధిలో వారు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులకు మేలు చేసే ఏ కార్యక్రమానికైనా తాము అండగా ఉంటామని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీలు ఆలపాటి రాజా, కంచర్ల శ్రీకాంత్, పేరాబత్తుల రాజశేఖర్ స్పష్టం చేశారు. పాత పెన్షన్ తో చంద్రబాబు తమకు పునర్జన్మ ఇచ్చారని ఉద్యోగులు భావోద్వేగానికి గురవగా, ఒక ఉద్యోగి చిన్నారి రోజూ పెన్షన్ ఇస్తే బాగుంటుంది అని అమాయకంగా చెప్పిన మాటలు సభలో అందరినీ ఆకట్టుకున్నాయి.

## ముగిసినన డ్యాన్స్ మాస్టర్ల వివాదం

**రంగంలోకి చిరంజీవి, ఫిలిం ఫెడరేషన్**

**26న సభ్యుల కీలక సమావేశం**

హైదరాబాద్, జూలై 19: తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర దుమారం రేపిన డ్యాన్స్ మాస్టర్ల సంఘం వివాదంపై ఫిలిం ఫెడరేషన్ అత్యవసరంగా సమావేశమైంది. ఈ భేటీ అనంతరం ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం సంఘంలో ఎలాంటి గొడవలు లేవని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి సుమలత ఆధ్వర్యంలోనే కార్యవర్గం కొనసాగుతుందని, ఎవరిపైనైనా ఆరోపణలు ఉంటే కమిటీ పరిశీలించి చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. మిగిలిన అన్ని విషయాలపై ఈ నెల 26వ తేదీన సభ్యులంతా ఒకచోట కూర్చుని మాట్లాడుకుని సమస్యలను పరిష్కరించుకుంటామని అనిల్ వెల్లడించారు. మరోవైపు ఈ వివాదంపై ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ స్పందించారు. డ్యాన్స్ మాస్టర్ల సంఘం వివాదానికి సంబంధించి ఫిలిం ఫెడరేషన్ కు తాను పూర్తిస్థాయి వివరణ ఇచ్చానని ఆయన తెలిపారు. తన వివరణ పట్ల ఫెడరేషన్ పెద్దలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. సంఘంలో ఎలాంటి అంతర్గత విభేదాలు ఉన్నా వాటన్నింటినీ సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుని ముందుకు సాగుతామని జానీ మాస్టర్ స్పష్టం చేశారు.

పరిశ్రమలో ఏ పెద్ద సమస్య వచ్చినా మెగాస్టార్ చిరంజీవి ఎల్లప్పుడూ ముందుండి పరిష్కరిస్తారని జానీ మాస్టర్ తెలిపారు. ఈ వివాదంపై కూడా చిరంజీవి ప్రత్యేక చొరవ తీసుకున్నారని, తనతో పాటు శేఖర్ మాస్టర్ తో ఆయన వ్యక్తిగతంగా మాట్లాడారని వెల్లడించారు. సంఘంలో ఉన్న అంతర్గత సమస్యలను ఆయనే స్వయంగా చొరవ తీసుకుని పరిష్కరించారని జానీ మాస్టర్ స్పష్టం చేశారు. మెగాస్టార్ రంగంలోకి దిగడంతో ఈ వివాదం సజావుగా ముగిసిందని పరిశ్రమ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి.

## అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి

**పాలమూరు పూర్తైతేనే రైతులకు మేలు.. ఉమ్మడి జిల్లా నేతలకు శ్రీనివాస్ గౌడ్ పిలుపు**



మహబూబ్ నగర్, జూలై 19: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకోవాల్సిన బాధ్యత ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నాయకులపై ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాకు సాగునీరు దక్కకుండా పొరుగు రాష్ట్రాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. అనుమతి లేకుండా ఆర్డీఎస్ నుంచి ఆంధ్రా నీరు తరలిస్తుంటే, ఆల్మట్టి వద్ద 300 టీఎంసీల నీరు నిలుపుకునేలా కర్ణాటక డ్యామ్ ఎత్తు పెంచుతోందని, వీటిని న్యాయపరంగా ఎదుర్కోవాలని సూచించారు. తెలంగాణకు నీళ్లు ఇవ్వవద్దని పనిచేసిన ఆంధ్రా అధికారిని కాంగ్రెస్ ప్రభుత్వం సలహాదారుగా నియమించి పొరుగు రాష్ట్రానికే మేలు చేసేలా కుట్రలు పన్నుతోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. గతంలో మహబూబ్ నగర్ లో 14 రోజులకు ఒకసారి మాత్రమే తాగునీళ్లు వచ్చేవని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజూ ఇంటింటికీ కృష్ణా జలాలను అందించామని శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు పూర్తి చేసి చెరువులు నింపడం వల్లే సాగు విస్తీర్ణం 2 లక్షల ఎకరాల నుంచి 10 లక్షల ఎకరాలకు పెరిగిందని ఆయన వివరించారు. ఇదే స్ఫూర్తితో పాలమూరు ప్రాజెక్టును కూడా వేగంగా పూర్తి చేస్తే జిల్లా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, ఉమ్మడి జిల్లా ప్రయోజనాల కోసం అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నేటి నుంచి యాదగిరిగుట్టలో వరుణ యాగం



యాదగిరిగుట్ట, జూలై 19: ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను అధిగమించి, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు వర్ష పాశుపత వరుణ యాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ యాగం వల్ల కరువు పరిస్థితులు పూర్తిగా తొలగిపోయి రైతులు, ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని ఆలయ వర్గాలు విశ్వసిస్తున్నాయి. కాగా, ఈ పవిత్రమైన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు అన్ని రకాల ప్రత్యేక ఏర్పాట్లను పూర్తి చేశారు.

## రామాయపట్నం పోర్టును ప్రైవేటుకు కట్టబెట్టేందుకు టీడీపీ భారీ కుట్ర

**ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు**



అమరావతి, జూలై 19: రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టీడీపీ పెద్దల జేబులు నింపేందుకు ఓ భారీ స్కామ్‌గా మార్చారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు. నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించి, తమ హయాంలో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణానికి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ పూర్తి చేశామని గుర్తుచేశారు. ఈపీసీ కాంట్రాక్టులను ఖరారు చేసి 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని.. ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు సిద్ధపడటం దారుణమని ఆరోపించారు. రామాయపట్నం పోర్టుతో రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు మరియు భారీ పారిశ్రామిక పెట్టుబడులు ముడిపడి ఉన్నాయని జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ. 1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌తో పాటు ఇండోసోల్ సోలార్ గిగా స్కేల్ తయారీ ప్లాంటు ముడిసరుకుల రవాణాకు ఈ డీప్ వాటర్ పోర్టే అత్యంత అవసరమన్నారు. వీటితో పాటు వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము దిగుమతి కోసం ఈ పోర్టులోనే రెండు బెర్తులను అభివృద్ధి చేస్తున్నారని గుర్తుచేశారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న పోర్టును రాష్ట్ర ప్రభుత్వం రూ. 4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తుంటే, కేవలం రూ. 1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. దీనివల్ల మిగిలిన రూ. 3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని, ఖజానాకు వేల కోట్ల నష్టం కలిగిస్తూ టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని.. "ఇదేం అర్థశాస్త్రం?" అంటూ చంద్రబాబును జగన్ సూటిగా ప్రశ్నించారు.

## తక్కువ వడ్డీతో నిధుల సమీకరణ

**10 రోజుల్లో ఫండింగ్ రోడ్ మ్యాప్ సిద్ధం**

**నీటిపారుదల శాఖ అధికారుల సమీక్షలో మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్, జూలై 19: సాగునీటి సంస్థలపై ఉన్న రుణభారాన్ని తగ్గించి, తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక రుణాలు సమీకరించేలా 10 రోజుల్లో సమగ్ర ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న 11 శాతం వడ్డీ రుణాలను తక్కువ వడ్డీకి పునర్వ్యవస్థీకరించడం ద్వారా ఏటా సుమారు 250 కోట్ల రూపాయల మేర ప్రభుత్వానికి ఆదా చేయవచ్చని ఈ సందర్భంగా మంత్రి వ్యాఖ్యానించారు. కేవలం బడ్జెట్ పైనే ఆధారపడకుండా సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం సమృద్ధి దిశగా నడిపించాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. సాగునీటి సంస్థలకు కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించే క్రమంలో రైతులపై ఎలాంటి అదనపు భారం పడకుండా కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. శాఖకు చెందిన ఖాళీ భూములతో పాటు నిజాంసాగర్ తదితర జలాశయాల పరిసరాల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు లేదా లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందే మార్గాలను అధ్యయనం చేయాలన్నారు. అలాగే 2022-23 తో పాటు పెండింగ్ లో ఉన్న అన్ని చట్టబద్ధమైన ఆడిట్లను తక్షణమే పూర్తి చేయాలని, ఆడిటర్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. భారీ పెట్టుబడులతో ఏళ్ల తరబడి సాగే ప్రాజెక్టుల కంటే, తక్కువ పెట్టుబడితో వేగంగా పూర్తయి రైతులకు సాగునీరు అందించే ప్రాజెక్టులకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన రుణాలు, నిధులు, పనుల పురోగతిపై సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి శాఖకు ఉన్న భూములు, ఇతర ఆస్తుల పూర్తి వివరాలను 15 రోజుల్లో క్రోడీకరించి సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా తక్షణమే ఆ నిధులు వారికి చేరేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, ఈఎన్సీ రమేష్ బాబు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బాధితులకు 10 సెల్‌ఫోన్లు అందజేసిన పోలీసులు


దాచేపల్లి జూలై 19: దాచేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2025–26 సంవత్సరాల మధ్య కాలంలో ప్రజలు పోగొట్టుకున్న 10 సెల్‌ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ అప్లికేషన్ ద్వారా పోలీసులు విజయవంతంగా రికవరీ చేశారు. ట్రేస్ చేసిన ఈ మొబైల్ ఫోన్లను ఆదివారం దాచేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాజావలి ఆధ్వర్యంలో బాధితుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన అనంతరం వారికి తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ ఖాజావలి మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే ప్రజలు తమ ఐఎంఈఐ నంబర్లతో సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే వాటిని సులభంగా రికవరీ చేయవచ్చని సూచించారు. పోగొట్టుకున్న తమ విలువైన ఫోన్లను అతి తక్కువ కాలంలోనే సాంకేతిక పరిజ్ఞానంతో తిరిగి రాబట్టినందుకు బాధితులు దాచేపల్లి పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# విశాఖలో ఘోర రోడ్డు ప్రమాదం

**లారీని ఢీకొట్టిన కారు, నలుగురు దుర్మరణం!**

**గాయపడిన మేనేజర్ చంద్రశేఖర్‌కు అత్యవసర చికిత్స**

**సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి**



విశాఖపట్నం, జూలై 19: విశాఖపట్నం జిల్లా ఆనందపురం - అనకాపల్లి జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున అత్యంత ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గండిగుండం పరిధిలోని సత్తారువు జంక్షన్ సమీపంలో పెందుర్తి నుంచి ఆనందపురం వైపు వెళ్తున్న కారు.. ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి అత్యంత బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జవగా, అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు ఘటనా స్థలంలోనే విగతజీవులుగా మారారు. మృతుల్లో పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు చెందిన అమూల్య నర్సింగ్ హోమ్ మేనేజర్, ఎమ్మెల్యే పీఏ అయిన చంద్రశేఖర్ కుమారుడితో పాటు డ్రైవర్ ఉన్నారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన వీరంతా శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జరగబోయే ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరిన క్రమంలో ఈ విషాదం చోటుచేసుకుంది.

ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న చంద్రశేఖర్‌ను స్థానికులు, పోలీసులు వెంటనే విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబుతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అరవింద బాబు హుటాహుటిన విశాఖకు బయలుదేరి వెళ్లారు. క్షతగాత్రుడైన చంద్రశేఖర్‌కు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించిన సీఎం, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆసుపత్రికి చేరుకుని చంద్రశేఖర్ ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పర్యవేక్షిస్తూ, మెరుగైన చికిత్స అందేలా చూస్తున్నారు.

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. మధురవాడ ఏసీపీ అప్పలరాజు, ట్రాఫిక్ ఎస్సై పాపారావులను ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆనందపురం పోలీసులు సహాయక చర్యలు చేపట్టి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన కారు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్లే ఈ ఘోరం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, కారు ఢీకొట్టిన తర్వాత ఆపకుండా వెళ్లిపోయిన సదరు లారీ ఆచూకీ కోసం 16వ జాతీయ రహదారిలోని అనకాపల్లి, దుక్కవానిపాలెం, నాతవలస టోల్ ప్లాజాల వద్ద ఉన్న సీసీటీవీ కెమెరాల రికార్డింగులను పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఈ ఘటనపై ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

### అధికారంలోకి రాగానే మత్స్యకార కుటుంబాలకు

## రూ.కోటి పరిహారం: వైఎస్సార్‌సీపీ హామీ

**విశాఖ బోటు ప్రమాద బాధితులకు జగన్ పంపిన రూ.49 లక్షల ఆర్థిక సాయం అందజేత**

**ఘటన జరిగి 15 రోజులైనా కూటమి మంత్రులకు పరామర్శించే తీరిక లేదా? నేతల మండిపాటు**



విశాఖపట్నం, జూలై 19: విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి వేటకు వెళ్లి బోటు తిరగబడిన ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటనపై కూటమి ప్రభుత్వం, అధికార యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ధ్వజమెత్తారు. ప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ ఆపరేషన్ చేపట్టకుండా 18 గంటల పాటు ఆలస్యం చేయడం వల్లే మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత నిధుల నుండి ప్రకటించిన రూ. 7 లక్షల చొప్పున మొత్తం రూ. 49 లక్షల చెక్కులను మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌మార్, బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు ఆదివారం బాధిత ఏడుగురు మత్స్యకార కుటుంబాలకు (గల్లంతైన ఆరుగురితో పాటు ప్రాణాలతో బయటపడిన చిన్నాకు) అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కేవలం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో చేతులు దులుపుకుందని విమర్శించారు. రాబోయే రోజుల్లో వైయస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బాధిత కుటుంబాలకు రూ. కోటి నష్టపరిహారం అందించే జీవో తీసుకురావడంతో పాటు కొత్త బోటును కూడా అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. విపత్తు జరిగి 15 రోజులు గడుస్తున్నా స్థానిక మంత్రులకు బాధితులను ఓదార్చే తీరిక లేకపోవడం దారుణమని వైయస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కంటి ఆపరేషన్ పేరుతో కుంటి సాకులు చెబుతూ పక్కనే ఉన్న జబ్బర్ తోట బాధితులను కలవకపోవడం ఆయన బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట అని, జగన్ పరామర్శకు వచ్చినప్పుడు ప్రెస్ మీట్ పెట్టి తిట్టడానికి లేని కంటి నొప్పి ఇప్పుడొచ్చిందా అని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి నిలదీశారు. హోం మంత్రి అనిత వీడియో కాల్ పరామర్శలతో పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయికి రావడం లేదని మండిపడ్డారు. సుమారు రూ. 40 లక్షల విలువైన బోటును కోల్పోయి రోదిస్తున్న మత్స్యకారుడు చిన్నాను ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని, గత వైయస్సార్‌సీపీ హయాంలో మత్స్యకార భరోసా, ఆయిల్ సబ్సిడీలతో ఆదుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బాధిత కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇప్పించే వరకు వైయస్సార్‌సీపీ పోరాటం ఆపదని, మత్స్యకారుల హక్కుల కోసం ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటామని నేతలు స్పష్టం చేశారు.

### ఏపీని గ్లోబల్ 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా

## తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి కందుల దుర్గేష్

**జైపూర్ ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్‌లో మంత్రి కీలక ప్రసంగం**

**ఏపీలో పెట్టుబడులు పెడితే పూర్తి ప్రోత్సాహం**

**సింగిల్ విండో అనుమతులపై ఇన్వెస్టర్లకు భరోసా**

రాజస్థాన్ (జైపూర్), జూలై 19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ప్రమోట్ చేయడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాయల్ వెడ్డింగ్స్‌కు రోల్ మోడల్‌గా నిలిచిన రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్ (ఐడబ్ల్యూటీసీ) లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైపూర్ కుకాస్ లోని విరాసత్ హెరిటేజ్ రెస్టారెంట్ లో ప్రముఖ వెడ్డింగ్ డెస్టినేషన్ ప్లానర్లు, ఈవెంట్ నిర్వాహకులతో మంత్రి కీలక సమావేశం నిర్వహించారు. అంతకుముందు రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి, పర్యాటక శాఖ మంత్రి దియా కుమారితో కలిసి ఏపీ టూరిజం స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ భేటీలో ఏపీలో వెడ్డింగ్ టూరిజం విస్తరణకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వ రాయితీలను వివరిస్తూ.. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో పర్యాటక రంగానికి కల్పిస్తున్న ప్రాధాన్యతను మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ సుదీర్ఘ సముద్ర తీరం, అద్భుతమైన ప్రకృతి అందాలు, చారిత్రాత్మక కోటలతో అంతర్జాతీయ వివాహ వేడుకలకు అత్యంత అనువైన ప్రాంతమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి బీచ్ వెడ్డింగ్స్ కోసం వైజాగ్ తీరం, స్టార్ హోటళ్లు రానున్న సూర్యలంక బీచ్, పొగమంచు కొండల అరకు, పచ్చని కోనసీమ మరియు సాంప్రదాయ వివాహాలకు తిరుపతి వంటి నగరాలు అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా హోమ్ స్టే, క్యారవాన్, ఫిల్మ్ టూరిజం వంటి వాటికి ఇన్వెస్టర్లకు భారీ రాయితీలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఏపీలో వెడ్డింగ్ డెస్టినేషన్ ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి సింగిల్ విండో విధానంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇస్తూ, క్షేత్రస్థాయి పరిశీలన కోసం వెడ్డింగ్ ప్లానర్లను ఏపీకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్‌తో పాటు హాస్పిటాలిటీ, టూరిజం రంగానికి చెందిన ప్రముఖ ఇన్వెస్టర్లు పాల్గొన్నారు.

## రైతుల భూములు లాక్కోవడం దారుణం

**న్యాయం చేయాలని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి డిమాండ్**



హైదరాబాద్, జూలై 19: బుల్లెట్ ట్రైన్ టెర్మినల్ పేరుతో శంషాబాద్ మండలం బహదూర్ గూడ రైతులకు తగిన న్యాయం చేయకుండా భూములను బలవంతంగా లాక్కోవడం సరికాదని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం బహదూర్ గూడలో పర్యటించిన వారు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, నేత తోకల శ్రీనివాస్ రెడ్డితో కలిసి బాధిత రైతులకు సంఘీభావం తెలిపారు. వందలాది మంది రైతుల జీవనాధారమైన 650 ఎకరాల భూమిని ప్రభుత్వం లాక్కోవడం దారుణమని విమర్శించారు. గతంలో పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు అదే భూములను బలవంతంగా తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల భూములు లాక్కుంటుంటే స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎందుకు స్పందించడం లేదని ఎంపీలు ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కల్లబొల్లి హామీలు ఇచ్చి ఆయన రైతులను మోసం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమైన నాయకులు వారి అభిప్రాయాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు తగిన న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వం వెనక్కి తగ్గేంత వరకు పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. గ్రామస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని విధాలా అండగా ఉంటామని బీజేపీ ఎంపీలు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.



## సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననంపై చట్టం తేవాలి

**ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు.. అఖిలపక్ష భేటీలో ఏపీ సాగునీటి ప్రాజెక్టులకు రూ. 60 వేల కోట్ల కేంద్ర సహకారం విజ్ఞప్తి**

న్యూఢిల్లీ, జూలై 19: సోషల్ మీడియాలో జరుగుతున్న వ్యక్తిత్వ హననాన్ని అరికట్టేందుకు పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ జరగాలని, దీని కట్టడికి కఠినమైన చట్టం కూడా తీసుకురావాలని కేంద్రాన్ని కోరినట్లు తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. దేశంలో విపరీతంగా పెరుగుతున్న మ్యూల్ అకౌంట్లు, షెల్ కంపెనీలు, ఆన్‌లైన్ సైబర్ మోసాల వల్ల ప్రజలు తమ పొదుపు సొమ్మును భారీగా కోల్పోతున్నారని, వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష భేటీకి హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో తెదేపా తరఫున పలు కీలక జాతీయ, రాష్ట్ర ప్రయోజనాల అంశాలను ప్రస్తావించినట్లు చెప్పారు. ముఖ్యంగా దేశంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నదుల అనుసంధానంపై జాతీయ స్థాయిలో చర్చ జరపాలని, ఏపీకి అత్యంత కీలకమైన గోదావరి-పెన్నా అనుసంధాన ప్రాజెక్టును వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఆక్వా ఫీడ్ ముడిసరకు ధరలు పెరిగి ఆక్వా రైతులు, మరోవైపు ధరల పతనంతో పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని కోరారు. పోలవరం తొలి దశను 2027 మార్చి నాటికి పూర్తి చేయడమే ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అలాగే రాష్ట్రంలోని 36 సాగునీటి ప్రాజెక్టులను 2029లోపు పూర్తి చేయాలని భావిస్తోందని.. వీటన్నింటికీ రూ. 60 వేల కోట్ల కేంద్ర సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈసారి మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రతిపక్షాలు కూడా మద్దతు ఇస్తాయని ఆశిస్తున్నామన్నారు. ఇదే సమయంలో అమరావతి అభివృద్ధిని అడ్డుకునేందుకు వైకాపా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని మండిపడుతూ.. రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల మద్దతు పూర్తిగా ఉందన్నారు. సమాజంలో మతం, కులం పేరుతో హింసకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు.




## చికెన్ సెంటర్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ బొండా ఉమ

విజయవాడ, జూలై 19: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 30వ డివిజన్ దేవీనగర్ 8వ రోడ్డులో గద్దె రవితేజ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'జీఆర్టీ చికెన్ సెంటర్ మరియు అరుణాచలేశ్వర కేటరర్స్ టిఫిన్స్ ఒఫాస్ట్ ఫుడ్ సెంటర్'ను ఆదివారం ఉదయం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ.. జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్య కాలనీ, వినాయక్ నగర్, రామకృష్ణాపురం వంటి ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, పెరిగిన జనాభాకు అనుగుణంగా ఇలాంటి నాణ్యమైన సేవలందించే వ్యాపార సంస్థల అవసరం ఎంతో ఉందన్నారు. వ్యాపారంలో నాణ్యత, పరిశుభ్రత, వినియోగదారుల సంతృప్తికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని నిర్వాహకులకు సూచించారు. గత అనుభవంతో మంచి పేరు తెచ్చుకున్న గద్దె రవితేజ ఈ నూతన వ్యాపారంలో కూడా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## క్రోసూరులో రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

క్రోసూరు, జూలై 19: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, నేరపూరిత కార్యక్రమాల్లో పాల్గొని తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఇన్ స్పెక్టర్ రవికుమార్ హితవు పలికారు. క్రోసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం నిర్వహించిన కౌన్సిలింగ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రౌడీ షీటర్లు తమ రోజువారీ పనులు ముగించుకున్న తర్వాత నేరుగా ఇళ్లకు చేరుకోవాలని, అనవసరంగా రోడ్లపై తిరుగుతూ ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్ల కదలికలపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని, రాత్రి వేళల్లో బ్లూకోట్స్ పోలీసులు వారి నివాస ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచుతారని స్పష్టం చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, స్థానికులను వేధించినా చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని, స్థానికులు కూడా పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తారని ఇన్ స్పెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు.

## పేకాట స్థావరంపై దాచేపల్లి పోలీసుల దాడి, ఐదుగురు అరెస్ట్

దాచేపల్లి, జూలై 19: మండలంలోని సారంగపల్లి అగ్రహారం గ్రామంలో జరుగుతున్న ఒక పేకాట స్థావరంపై స్పెషల్ బ్రాంచ్ సమాచారంతో పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 5,870 నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ప్రజలు పేకాట వంటి చట్టవిరుద్ధమైన అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

## మేఘాద్రి రిజర్వాయర్‌లో మునిగి ఇద్దరు ఇంటర్ విద్యార్థుల మృతి


పెందుర్తి, జూలై 19: సరదాగా స్నానానికి దిగి ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు నీటిలో మునిగి మృతి చెందిన విషాద ఘటన విశాఖ జిల్లా పెందుర్తి మండలం చింతగట్ల సమీపంలోని మేఘాద్రి రిజర్వాయర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్ చదువుతున్న ఐదుగురు విద్యార్థుల బృందం ఆదివారం మేఘాద్రి రిజర్వాయర్ సందర్శనకు వచ్చారు. ఈ క్రమంలో వారిలో కొందరు స్నానానికని నీటిలోకి దిగగా, లోతు ఎక్కువ ఉన్న ప్రాంతంలో దీపక్ (17), రామచంద్రరావు (18) అనే ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. గమనించిన తోటి స్నేహితులు వెంటనే సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గజఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

## జమ్మూకశ్మీర్‌లో వరదల బీభత్సం

**10 మంది దుర్మరణం!**

**రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో పొంగిపొర్లుతున్న నదులు**

శ్రీనగర్, జులై 19: జమ్మూకశ్మీర్‌లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలు తీవ్ర బీభత్సం సృష్టించగా, రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో సంభవించిన మెరుపు వరదల కారణంగా ఇప్పటివరకు 10 మంది మృతి చెందారు మరియు పలువురు తీవ్రంగా గాయపడ్డారు. రాజౌరీ జిల్లాలో దార్హాలి, ఖాండ్లీ, సుక్తోహ్, జమోలా నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో కొత్త బస్టాండ్ సహా అనేక ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయని, పలు వాహనాలు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయని అధికారులు వెల్లడించారు. బేలా కాలనీ సమీపంలో దార్హాలి నది రక్షణ గోడ ధ్వంసం కావడంతో పాటు అబ్దుల్లా బ్రిడ్జి పరిసరాల్లోని 50కి పైగా కుటుంబాలను అధికారులు అత్యవసరంగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు; మరోవైపు పూంచ్ జిల్లాలో పలుచోట్ల కొండచరియలు విరిగిపడి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు భారీ నష్టం వాటిల్లగా సహాయక బృందాలు బాధితులను రక్షించే పనుల్లో నిమగ్నమయ్యాయి. వరద పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలపగా, జులై 23 వరకు జమ్మూకశ్మీర్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.



## అయోధ్య ట్రస్ట్ సీఈవో పోస్టుకు పోటెత్తిన దరఖాస్తులులి

**గడువు ముగిసేసరికి 5 వేల అప్లికేషన్లు!**

అయోధ్య: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తుల గడువు ముగిసే సమయానికి దేశవ్యాప్తంగా ఊహించని రీతిలో భారీ స్పందన లభించింది. ఈ ప్రతిష్టాత్మక పదవి కోసం ఏకంగా 5 వేలకు పైగా అప్లికేషన్లు వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ నియామక రేసులో రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులతో పాటు ఉన్నత స్థాయి మాజీ సైనిక అధికారులు కూడా పెద్ద సంఖ్యలో పోటీ పడుతుండటం విశేషం. ఈ నేపథ్యంలో, వచ్చిన వేలాది దరఖాస్తులను క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేసేందుకు ట్రస్ట్ ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ట్రస్ట్ నిర్దేశించిన నిర్దిష్ట అర్హతలు, ప్రమాణాల ఆధారంగానే అర్హులైన అభ్యర్థిని ఎంపిక చేయనున్నారని, ఎంపికైన నూతన అధికారి ఆలయ ట్రస్ట్‌కు సంబంధించిన కీలక పరిపాలనా వ్యవహారాలన్నింటినీ పూర్తిస్థాయిలో పర్యవేక్షించనున్నారని ఆలయ వర్గాలు స్పష్టం చేశాయి.

# రాజధాని అసైన్డ్ భూముల తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

**వైయస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి**



తాడేపల్లి, జూలై 19: రాజధాని అసైన్డ్ భూముల కేసులో హైకోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని చంద్రబాబుకు క్లీన్ చిట్ దొరికినట్లు ఎల్లో మీడియా అబద్ధపు ప్రచారం చేస్తోందని, ఈ తీర్పుపై తాము ఖచ్చితంగా సుప్రీంకోర్టులో అప్పీల్ చేయబోతున్నామని వైయస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం రాజకీయ ఫిర్యాదు కాదని, చంద్రబాబు బినామీల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన జీఓ 41 ముసుగులో నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి తక్కువ ధరలకే బినామీల పేర్లతో లాక్కున్న రూ. 4,400 కోట్ల పక్కా కుంభకోణమని మండిపడ్డారు. ఈ కేసులో 76 మంది సాక్షుల వాంగ్మూలాలు, నారాయణ విద్యాసంస్థల నుంచి రూ. 18.1 కోట్ల మనీ ట్రయల్స్ మరియు మాజీ మంత్రి నారాయణ కీలక ఆడియో రికార్డుల వంటి పక్కా ఆధారాలు ఉన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం మారగానే సీఐడీ దర్యాప్తు సంస్థ కాస్తా "చంద్రబాబు ఇన్వెస్టిగేషన్ డిమెంట్"గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే వ్యవస్థలను మేనేజ్ చేస్తూ స్కిల్ డెవలప్‌మెంట్, మద్యం విధానం, ఫైబర్ నెట్, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి వరుస కుంభకోణాల కేసులను 'మిస్టేక్ ఆఫ్ ఫాక్ట్' కింద క్లోజ్ చేస్తున్నారని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కూడా నిందితులకు అనుకూలంగా మారారని ఆరోపించారు. హైకోర్టు కేవలం ప్రాథమిక దశలో ఎఫ్ఐఆర్‌ను మాత్రమే రద్దు చేసిందని, ట్రయల్ జరిగి నిర్దోషిగా తేలితేనే క్లీన్ చిట్ అవుతుందని పేర్కొంటూ, నిరుపేద రైతులకు న్యాయం జరిగే వరకు తాము సుప్రీంకోర్టు వేదికగా చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని మనోహర్ రెడ్డి వెల్లడించారు.

# శ్రీ సత్యసాయి ట్రాఫిక్ పోలీస్ బూత్ ప్రారంభంచిన ప్రభుత్వ విప్ బొండా ఉమా

విజయవాడ, జూలై 19: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం సీతారాంపురం సిగ్నల్ వద్ద నూతనంగా నిర్మించిన ట్రాఫిక్ పోలీస్ బూత్‌ను ఆదివారం ఉదయం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ.. 'మానవ సేవే మాధవ సేవ' అనే బాబా సందేశం ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. గతంలో విజయవాడకు వరదలు వచ్చిన సమయంలో సత్యసాయి ట్రస్ట్ చైర్మన్ రత్నాకర్ నాయకత్వంలో బాధితులకు అందించిన నిత్యావసరాలు, ఆర్థిక సాయం మరియు కుట్టు మిషన్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. పుట్టపర్తి వేదికగా ట్రస్ట్ అందిస్తున్న ఉచిత విద్య, అత్యాధునిక వైద్య సేవలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయని బొండా ఉమా కొనియాడారు. బాబా పావన చరణాలు స్పృశించిన విజయవాడ నగరంలో, ప్రజల సౌకర్యార్థం ఈ ట్రాఫిక్ బూత్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమాజాభివృద్ధికి కృషి చేసే ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం తరపున, స్థానిక ఎమ్మెల్యేగా తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మాచర్ల గోపి, ఇజ్జాడ దుర్గారావు, సమితి కన్వీనర్లు జి. సాయి విశ్వనాథ్, ఎన్.వి.ఎల్. నరసింహారావుతో పాటు పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు జిల్లావ్యాప్తంగా పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ

**క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడి**

నరసరావుపేట, జూలై 19: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగా సోమవారం (జూలై 20) జిల్లా వ్యాప్తంగా యథావిధిగా పీజీఆర్ఎస్ (ప్రజా గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకు అన్ని పీజీఆర్ఎస్ కేంద్రాల్లో 'సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్' ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సేవలు పొందిన అనంతరం ప్రజలు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని నమోదు చేయాలని కోరారు. జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ ఆఫీసులు, తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ ఆఫీసులు మరియు గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీల స్వీకరణ ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటు 1100 టోల్‌ఫ్రీ నంబర్, మీకోసం వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని, అలాగే 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా 300కు పైగా పౌర సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ కృతిక శుక్లా వివరించారు.



# పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన జనసేన నాయకుడు గంజి చిరంజీవి

హైదరాబాద్, జూలై 19: ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పార్టీ నాయకుడు గంజి చిరంజీవి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన.. డిప్యూటీ సీఎం త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా సేవలోకి రావాలని ఆకాంక్షించారు. పవన్ కళ్యాణ్ క్షేమంగా ఉండాలని, ఆయన ఆరోగ్యం మెరుగుపడాలని ప్రత్యేకంగా నిర్వహించిన సుదర్శన హోమం పూజా కంకణాన్ని ఈ సందర్భంగా గంజి చిరంజీవి ఆయనకు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# భూ కబ్జా కేసులో మాజీ స్పీకర్

# తమ్మినేని కుటుంబంపై కేసు: 8 మంది అరెస్ట్

శ్రీకాకుళం, జూలై 19: శ్రీకాకుళంలో సంచలనం సృష్టించిన ఒక భారీ భూ కబ్జా వ్యవహారంలో వైకాపా నేత, శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంతో పాటు ఆయన కుటుంబసభ్యులు, సబ్ రిజిస్ట్రార్ సహా మొత్తం 13 మందిపై శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటికే 8 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. శ్రీకాకుళంలోని బలగ పరిధి సర్వే నంబర్ 35/13లో ఉన్న రూ. 3 నుండి 4 కోట్ల విలువైన భూమిని అక్రమంగా దక్కించుకునేందుకు నిందితులు కుట్ర పన్నారని ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా అసలు యజమాని అంధవరపు గోవిందరాజులు బతికి ఉండగానే చనిపోయినట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రం సృష్టించడమే కాకుండా, ఒడిశాకు చెందిన అడబాల రజనీ అనే మహిళను ఆయన కుమార్తెగా చూపిస్తూ తమ్మినేని చిరంజీవి నాగ్ పేరిట ఫోర్జరీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించారని వివరించారు. ఈ స్థలంలో ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నించగా, అసలు యజమానులు పోలీసులను ఆశ్రయించడంతో ఈ నకిలీ పత్రాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ముఠా వెనుక, మధ్యవర్తిత్వం వెనుక మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణి ఉ



న్నట్లు దర్యాప్తులో గుర్తించామని ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అడబాల రజనీ (ఏ1), తెలుగు సతీష్ కుమార్ (ఏ2), సలిపిల్లి లక్ష్మణరావు (ఏ3),ముదాడ్ల ఉపేంద్ర కుమార్ (ఏ8), జెగురిపాటి ఉపేంద్ర రావు (ఏ9), మామిడి గోపాలకృష్ణ (ఏ10), సాంబాన సాంబశివరావు (ఏ11), కూన పెద్దిరాజు (ఏ12)లను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు కీలక సూత్రధారులుగా ఉన్న త్రినాథ్ (ఏ4), తమ్మినేని చిరంజీవి నాగ్ (ఏ5), తమ్మినేని సీతారాం (ఏ6), తమ్మినేని వాణి (ఏ7) లతో పాటు అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన సబ్‌రిజిస్ట్రార్ బొడ్డేపల్లి అరుణ (ఏ13)లపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, పరారీలో ఉన్న మిగిలిన నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్పీ వెల్లడించారు.

# వైభవంగా ఇస్కాన్ జగన్నాథ రథయాత్ర

**ప్రారంభించిన ప్రభుత్వ విప్ బొండా ఉమ**

విజయవాడ, జూలై 19: నగరంలో సనాతన ధర్మ పరిరక్షణకు, భక్తిభావానికి ప్రతీకగా ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పూరీ జగన్నాథ స్వామి రథయాత్ర ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా సాగింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం బి.ఆర్.టి.ఎస్ రోడ్డులోని సత్యనారాయణపురం శారదా కళాశాల ఎదురుగా జరిగిన ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు గద్దె అనురాధ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ రథయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 5000 కిలోల లడ్డూలతో అలంకరించిన దివ్య రథాన్ని వారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అంతకుముందు జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన బొండా ఉమ.. అనంతరం భక్తులతో కలిసి స్వయంగా స్వామివారి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రతినిధులు భక్తులకు శ్రీమద్భగవద్గీత గ్రంథాలను బహుకరించారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు



మాట్లాడుతూ.. భక్తి, ఆధ్యాత్మికత అనేవి సమాజంలో ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఏటా ఇస్కాన్ సంస్థ ఇలాంటి రథయాత్రలను నిర్వహించడం అభినందనీయమన్న ఆయన.. జగన్నాథ స్వామి వారి దివ్య ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. హరినామ సంకీర్తనలు, భజనల కోలాహలం మధ్య సాగిన ఈ రథయాత్రలో వేలాది మంది భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మరియు భక్తులు భారీగా పాల్గొన్నారు.

# ఘనంగా ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ

**నగర నడిబొడ్డున విగ్రహ ఏర్పాటుకు బొండా ఉమ ప్రతిపాదన**

విజయవాడ, జూలై 19: కాపు సామాజికవర్గ హక్కులు, రిజర్వేషన్ల సాధన కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత నాయకుడు, మాజీ మంత్రి దివంగత ముద్రగడ పద్మనాభం అని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కొనియాడారు. ఆదివారం విజయవాడ గాంధీనగర్‌లోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ.. కాపు సమాజ సంక్షేమం కోసం ముద్రగడ చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని, ఆయన ఆశయ సాధనే



మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ముద్రగడ సేవలను చిరస్థాయిగా నిలిపేందుకు విజయవాడ నగర నడిబొడ్డున ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. 1988లో విజయవాడలో జరిగిన చారిత్రాత్మక కాపునాడు సభను గుర్తుచేస్తూ.. ముద్రగడకు ఈ నగరంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ప్రస్తుతం కాపు సమాజమంతా ఐక్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని, ఇందుకోసం త్వరలోనే విజయవాడలో రాష్ట్రవ్యాప్త కాపు నాయకులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఒక భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. కాపు సామాజికవర్గ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ విభేదాలు వీడి కలిసికట్టుగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘాల ప్రతినిధులు, వంగవీటి రంగా అభిమానులు, ముద్రగడ అనుచరులు మరియు పెద్ద సంఖ్యలో కాపు సామాజికవర్గ నేతలు పాల్గొని ముద్రగడకు నివాళులు అర్పించారు.

# క్రాంతికుమార్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ 10 లక్షల ఆర్థిక సాయం

**బాధిత కుటుంబానికి అందజేసిన నేతలు**

విజయవాడ, జూలై 19: కృష్ణలంక సీఐ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న పేరుపోగు క్రాంతికుమార్ కుటుంబానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎంపీ నందిగాం సురేష్, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, మొండితోక జగన్మోహన్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము కనకరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ, వైఎస్ జగన్ మానవతా దృక్పథంతో ఈ ఆర్థిక సాయం అందించారని, బాధిత కుటుంబానికి చట్టప్రకారం రావాల్సిన ప్రభుత్వ ప్రయోజనాలు అందజేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా కేవలం మానవత్వంతోనే వైఎస్ జగన్ ఈ సాయం చేశారని, ఆర్థిక సాయంతో పాటు క్రాంతికుమార్ చిన్న కుమారుడి వైద్య చికిత్స బాధ్యతను కూడా పార్టీ తరపునే తీసుకున్నట్లు మాజీ ఎంపీ నందిగాం సురేష్ వెల్లడించారు. "ఏ కష్టం వచ్చినా నేనున్నాను" అనే భరోసాను జగన్ మరోసారి నిలబెట్టుకున్నారని దేవినేని అవినాష్ పేర్కొనగా.. క్రాంతికుమార్ ఆత్మహత్య ఘటన రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుకు నిదర్శనమని మల్లాది విష్ణు దుయ్యబట్టారు. తమ కష్టకాలంలో రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించి పిల్లల భవిష్యత్తుకు భరోసానిచ్చిన వైఎస్ జగన్‌కు క్రాంతికుమార్ తండ్రి పేరుపోగు వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.





# పరిశ్రమల రాకతో స్థానికంగానే ఉద్యోగాలు: మంత్రి సవిత

హిందూపురం, జూలై 19: ఉన్నత విద్య పూర్తి కాగానే యువత పొట్టచేత పట్టుకుని వలసలు వెళ్లే బాధలు తప్పేలా, నివాసమున్న చోటే ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఈడిగ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు రేయింబవళ్లు కృషి చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారన్నారు. గీత కార్మికులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే నీరా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు, లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పించడంతో పాటు 50 ఏళ్లు దాటిన గీత కార్మికులకు పెన్షన్ అందిస్తున్న ఘనత చంద్రబాబుదేనన్నారు. బీసీ బిడ్డలు సివిల్స్, డీఎస్సీ వంటి పోటీ పరీక్షల్లో రాణించేందుకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. హిందూపురం నియోజకవర్గం నందమూరి వంశీయులకు అడ్డా అని, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గ అభివృద్ధికి అవిరళ కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఈడిగ సామాజికవర్గ విద్యార్థులకు మంత్రి సవిత చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఇంటర్‌లో 80 శాతం పైబడి మార్కులు సాధించిన వారికి రూ. 10 వేలు, అంతకంటే తక్కువ వచ్చిన వారికి రూ. 8 వేల నగదు పురస్కారంతో పాటు తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. అలాగే టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మార్కుల శాతాన్ని బట్టి రూ. 5 వేలు, రూ. 3 వేలు మరియు మొదటి మూడు స్థానాల విజేతలకు రూ. 15 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కిరణ్ కుమార్, హరికృష్ణ, గోపాల్, మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య గౌడ్ మరియు పెద్ద సంఖ్యలో ఈడిగ సామాజికవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హంద్రీనీవా ప్రాజెక్టును నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం

**3 వేల కోట్ల పనుల్లో భారీ అవినీతి.. చేత్తో లాగితే ఊడిపోతున్న లైనింగ్**

**రాయలసీమ నీటి హక్కుల సాధన కోసం 'చలో చోళసముద్రం'తో పోరుబాట**

అనంతపురం, జూలై 19: రాయలసీమ రైతాంగానికి జీవితాధారమైన హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తోందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల బృందం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కాలువల విస్తరణ, లైనింగ్ పనుల పేరుతో రూ. 3 వేల కోట్ల ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లు, పాలకులు దోచుకున్నారని మండిపడింది. హంద్రీనీవా పరిరక్షణకు పిలుపునిస్తూ అనంతపురం, కర్నూలు జిల్లాల వైయస్సార్‌సీపీ నేతలు ఆదివారం 'చలో చోళసముద్రం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా చోళసముద్రం నుండి నారాయణపురం వరకు కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనంతరం ఏర్పాటు చేసిన సభలో గ్రేటర్ రాయలసీమ టాస్క్‌ఫోర్స్ కన్వీనర్, మాజీ మంత్రి డాక్టర్ సాకె శైలజానాథ్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ప్రసంగించారు. వైయస్ జగన్ ప్రభుత్వం హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచుతూ జారీ చేసిన జీఓలను, టెండర్లను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం.. ఆ సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కులకు కుదించి రాయలసీమకు ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం చేసిన లైనింగ్ పనులు అత్యంత నాసిరకంగా ఉండి, నీరు వదిలితే కొట్టుకుపోయేలా ఉన్నాయని, ఈ అవినీతిపై సమగ్ర విచారణ జరిపి నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని అక్రమ ప్రాజెక్టులపై నోరు మెదపని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిలిపివేసి ఈ ప్రాంత ప్రయోజనాలను పక్క రాష్ట్రాలకు తాకట్టు పెట్టారని వైయస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. రూ. 3 వేల కోట్ల పనులు చేశామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, అనంతపురం జిల్లాకు రావాల్సిన 80 టీఎంసీల నీటిని ఎందుకు తీసుకురాలేకపోయిందో సమాధానం చెప్పాలన్నారు. ఆల్మట్టి ఎత్తు పెంపు, అప్పర్ భద్ర వంటి అంశాల్లో చంద్రబాబు వైఫల్యం వల్ల సీమ భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీనీవా ప్రాజెక్టును 11,500 క్యూసెక్కుల గరిష్ట సామర్థ్యానికి విస్తరించి రైతుల కల సాకారం చేస్తామని నేతలు స్పష్టం చేశారు. రాయలసీమ నీటి హక్కుల సాధన కోసం ఒంగోలు, నెల్లూరు సహా అన్ని కరవు జిల్లాల ప్రజలను ఐక్యం చేస్తూ వైయస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఉషాశ్రీ చరణ్, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, వైయస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు మరియు పెద్ద సంఖ్యలో రైతు నాయకులు పాల్గొన్నారు.


# దాచేపల్లిలో రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

దాచేపల్లి, జూలై 19: ప్రజల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణే లక్ష్యంగా దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. దాచేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఖాజావలి ఆధ్వర్యంలో, ఎస్ఐలు పాపారావు, ఖాసింల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో పోలీసులు రౌడీ షీటర్లకు పలు కీలక సూచనలు చేశారు. రౌడీ షీటర్లంతా చట్టాన్ని గౌరవిస్తూ, నేరపూరిత కార్యకలాపాలకు దూరంగా ఉండి సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని హితవు పలికారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగించినా, అసాంఘిక చర్యలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

వయ్యారి చిత్రం



కృతిసనన్





# జాతీయ వేదికపై తెలుగు సినిమా సత్తా

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రసీమ విశేష ప్రతిభ కనబరిచింది. 2024లో విడుదలైన చిత్రాలకు ప్రకటించిన ఈ అవార్డుల్లో తెలుగు సినిమాలు మొత్తం తొమ్మిది జాతీయ పురస్కారాలను కైవసం చేసుకుని మరోసారి జాతీయ స్థాయిలో తమ సత్తాను చాటాయి. భారీ వాణిజ్య చిత్రాల నుంచి చిన్న కథా చిత్రాల వరకు పలు విభాగాల్లో గుర్తింపు దక్కడం టాలీవుడ్‌కు గర్వకారణంగా మారింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా ఎంపికైంది. ఈ చిత్రానికి నితిన్ జిహానీ చౌదరి ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ విభాగంలో జాతీయ పురస్కారం అందుకున్నారు. భవిష్యత్తు నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలోని సాంకేతిక విలువలు, నిర్మాణ వైభవం జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నాయి. అల్లు అర్జున్ కథానాయకుడిగా, సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పుష్ప 2' చిత్రం కూడా జాతీయ వేదికపై తన ముద్ర వేసింది. ఈ చిత్రానికి సుకుమార్ ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే విభాగంలో పురస్కారం అందుకోగా, దీపాలీ నూర్, శీతల్ శర్మ ఉత్తమ వస్త్రాల రూపకల్పన విభాగంలో జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. వాణిజ్య హంగులతో పాటు బలమైన కథనానికి ఈ గుర్తింపు లభించడం విశేషంగా భావిస్తున్నారు. కథా బలం ఉన్న చిన్న చిత్రాలు కూడా ఈసారి జాతీయ పురస్కారాల్లో మెరిశాయి. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన 'లక్కీ భాస్కర్' చిత్రానికి ఉత్తమ సంభాషణల రచయితగా ఆయన అవార్డు అందుకున్నారు. నందకిశోర్ ఇమాని దర్శకత్వంలో వచ్చిన '35 -- చిన్న కథ కాదు' ఉత్తమ బాలల చిత్రంగా ఎంపిక కాగా, ఆ చిత్రంలో నటించిన అరుణ్‌దేవ్ పోతుల ఉత్తమ బాలనటుడి పురస్కారాన్ని అందుకున్నాడు. నిహారిక కొణిదెల నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తెలుగు ప్రాంతీయ చిత్రంగా ఎంపికైంది. ఈ చిత్రానికి పి. రవికుమార్ ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ విభాగంలో జాతీయ పురస్కారం అందుకున్నారు. గ్రామీణ నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల ప్రశంసలతో పాటు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందింది. ఈ ఏడాది 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప 2', 'కమిటీ కుర్రోళ్లు', '35 -- చిన్న కథ కాదు', 'లక్కీ భాస్కర్' చిత్రాలు కలిపి మొత్తం తొమ్మిది జాతీయ పురస్కారాలను సాధించాయి. భారీ చిత్రాలతో పాటు వినూత్న కథాంశాలతో తెరకెక్కిన చిన్న సినిమాలకు కూడా గుర్తింపు దక్కడం తెలుగు చిత్రసీమ సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచింది. ఈ విజయంతో దర్శకులు, నటులు, సాంకేతిక నిపుణుల్లో కొత్త ఉత్సాహం నెలకొనగా, భవిష్యత్తులో మరిన్ని నాణ్యమైన తెలుగు చిత్రాలు జాతీయ స్థాయిలో సత్తా చాటాలనే ఆశాభావం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.


# మొదటి ప్రేమను గుర్తుచేసుకున్న అనుష్క



టాలీవుడ్ ప్రముఖ నటి అనుష్క శెట్టి తన పాఠశాల రోజులలో ఎదురైన తొలి ప్రేమ ప్రతిపాదన గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. చిన్నతనంలో జరిగిన ఆ సంఘటన ఇప్పటికీ తనకు మధుర జ్ఞాపకంగానే ఉందని తెలిపారు. ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అనుష్క.. తాను పాఠశాలలో చదువుకుంటున్న రోజుల్లో ఒక సహ విద్యార్థి ఎంతో ధైర్యంగా వచ్చి తనపై ప్రేమను వ్యక్తం చేశాడని గుర్తుచేసుకున్నారు. అయితే ఆ వయసులో ప్రేమ అంటే ఏమిటో కూడా పూర్తిగా అర్థం కాలేదని, అతను చెప్పిన వెంటనే అమాయకంగా 'సరే' అని సమాధానం చెప్పానని నవ్వుతూ వెల్లడించారు. ఆ సంఘటనను అప్పట్లో చాలా సాధారణంగా తీసుకున్నానని, కానీ ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అది జీవితంలో మరచిపోలేని మధుర జ్ఞాపకంగా మిగిలిపోయిందని అనుష్క చెప్పారు. చిన్ననాటి అమాయకత్వం వల్ల జరిగిన ఆ సంఘటనను ఇప్పటికీ చిరునవ్వుతో గుర్తు చేసుకుంటానని తెలిపారు. యోగ శిక్షకురాలిగా తన వృత్తిని ప్రారంభించిన అనుష్క, నాగార్జున హీరోగా నటించిన 'సూపర్' చిత్రంతో సినీ రంగంలో అడుగుపెట్టారు. అనంతరం 'అరుంధతి', 'బాహుబలి', 'భాగమతి' వంటి విజయవంతమైన చిత్రాలతో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం కూడా విభిన్న కథలతో కూడిన చిత్రాల్లో నటిస్తూ సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. వ్యక్తిగత జీవితానికి సంబంధించి తరచూ పుకార్లు వినిపిస్తున్నప్పటికీ, వాటిపై ఆమె బృందం ఇప్పటికే పలుమార్లు స్పష్టత ఇచ్చింది.

# 'రామాయణం'లో భాగం కావడం గర్వంగా ఉంది

ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణం' చిత్రంలో భాగం కావడం తన జీవితంలో మరచిపోలేని అనుభూతి అని ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప ప్రయాణమని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన 'రామాయణం' ప్రచార కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న రకుల్.. ఈ సందర్భంగా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఇంత భారీ స్థాయి చిత్రంలో నటించే అవకాశం దక్కడం గర్వకారణమని, ప్రపంచ వేదికపై భారతీయ ఇతిహాసాన్ని ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించే ప్రయత్నంలో భాగస్వామి కావడం ఎంతో ప్రత్యేకమని తెలిపారు. దర్శకుడు నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఈ చిత్రంలో రకుల్ శూర్పణఖ పాత్రను పోషిస్తున్నారు. కథలో కీలకమైన ఈ పాత్రలో ఆమె ఎలా కనిపించనున్నారన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. భారీ వ్యయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రూపొందిస్తున్న 'రామాయణం'ను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగం 2026 దీపావళి సందర్భంగా, రెండో భాగం 2027 దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.



భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పీవీ సింధు జపాన్ ఓపెన్ 2026 లో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. టోక్యోలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్ మ్యాచ్‌లో సింధు 21-17, 21-17 తేడాతో జపాన్ స్టార్ ప్లేయర్ అకానె యామగూచిని వరుస గేమ్స్‌లో ఓడించింది. ఈ అద్భుత విజయంతో సింధు సరికొత్త రికార్డు సృష్టించింది. గాయాల నుంచి కోలుకుని, సుదీర్ఘ టైటిల్ కరవుకు ఎండ్ కార్డ్ వేస్తూ సింధు అదరగొట్టింది. దీంతో తన ప్రత్యేకతను మరోసారి చాటుకుంది.

# చరిత్ర సృష్టించిన పీవీ సింధు





స్టార్ షట్లర్ పీవీ సింధు భారత బ్యాడ్మింటన్ రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ 2026 టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శనతో క విజేతగా నిలిచింది. టోక్యో మెట్రోపాలిటన్ జిమ్నాసియంలో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్ మ్యాచ్‌లో సింధు అసాధారణ ఆటతీరును కనబరిచింది. హోమ్ క్రౌడ్ మద్దతుతో బరిలోకి దిగిన జపాన్ స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ప్రపంచ నంబర్ 3 అకానె యామగూచిని వరుస గేమ్స్‌లో చిత్తు చేసింది. దీంతో జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ దక్కించుకుంది.

గత రెండేళ్లుగా పీవీ సింధు ఫామ్‌పై, ఆమె ఆటతీరుపై క్రీడా వర్గాల్లో రకరకాల సందేహాలు వ్యక్తమయ్యాయి. వరుస గాయాల బారిన పడటం, ఆధునిక బ్యాడ్మింటన్ ఆటలో వస్తున్న వేగవంతమైన మార్పులు, 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీ తర్వాత సుదీర్ఘ కాలంగా టైటిల్ కరవు ఎదుర్కోవడం వంటి సమస్యలు ఆమెను వెంటాడాయి. దీంతో సింధు మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకోగలదా లేదా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే వాటన్నింటికీ ఈ 31 ఏళ్ల భారత స్టార్ ప్లేయర్ తన రా పవర్, అద్భుతమైన వ్యూహాలు, మానసిక దృఢత్వంతో కూడిన ఆటతో టోక్యో కోర్టులోనే పక్కా సమాధానం ఇచ్చింది. ఫైనల్ మ్యాచ్ ఆరంభం నుంచి ఇద్దరి మధ్య హోరాహోరీ పోరు సాగింది. మొదటి గేమ్‌లో సింధు తనదైన శైలిలో క్రాస్ కోర్ట్ డ్రాప్స్, పవర్‌ఫుల్ స్మాష్‌లతో యామగూచి లయను దెబ్బతీసింది. ఒక దశలో స్కోరు బోర్డు ఇరువైపులా సమంగా మారుతూ ఉత్కంఠ రేపినప్పటికీ, ఒత్తిడి సమయాల్లో సింధు పట్టుదలగా నిలిచి కీలక పాయింట్లు సాధించి మొదటి గేమ్‌ను 21-17 తో కైవసం చేసుకుంది. తొలి గేమ్ గెలిచిన ఊపుతో రెండో గేమ్‌లో సింధు తన అగ్రెసివ్ ఆటను మరింత పెంచింది. జపాన్ ప్రేక్షకుల నుంచి లభిస్తున్న మద్దతుతో యామగూచి పుంజుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేసినప్పటికీ, సింధు డిఫెన్స్ విభాగాన్ని ఛేదించలేకపోయింది. సింధు నెట్ ప్లే వద్ద చూపిన చాకచక్యం యామగూచిని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టి తప్పులు చేసేలా చేసింది. రెండో గేమ్‌లో కూడా సింధు క్రమశిక్షణను కోల్పోకుండా ఆడి 21-17 తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. నాలుగు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత యామగూచిని ఆమె సొంత గడ్డపైనే ఓడించడం ద్వారా సింధు బ్యాడ్మింటన్ ప్రపంచానికి ఒక బలమైన సంకేతాన్ని పంపింది. తాను మళ్లీ ఫామ్‌లోకి వచ్చానని, భవిష్యత్తు టోర్నీలకు సిద్ధంగా ఉన్నానని ఈ గెలుపు ద్వారా నిరూపించింది.

# లార్డ్స్ వన్డేలో టీమిండియా ఓటమి

## రోహిత్ సెంచరీ వృథా..

**లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో టీమిండియా 27 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కోల్పోయింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 387 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ బెన్ డక్కెట్ (141 పరుగులు, 135 బంతుల్లో, 18 ఫోర్లు, 1 సిక్స్) భారీ సెంచరీతో చెలరేగాడు. అతడితో పాటు జాకబ్ బెథెల్ (91), జో రూట్ (74 నాటౌట్, 48 బంతుల్లో) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత బౌలర్లు ఘోరంగా విఫలమయ్యారు.**

అనంతరం 388 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ 147 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత 77 పరుగులు చేసిన గిల్.. రషీద్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లి, రోహిత్‌తో జతకట్టాడు. వీరిద్దరూ దూకుడుగా ఆడుతూ స్కోర్ బోర్డును ముందుకు నడిపించారు. ఈ క్రమంలో రోహిత్ 34 బంతుల్లో తన 34వ వన్డే సెంచరీ మార్క్‌ను పూర్తి చేసుకున్నాడు. వరుస బౌండరీలు బాది మంచి జోరు మీద ఉన్న రోహిత్(110 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్స్‌లతో 138) జాకబ్ బెథల్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డయ్యాడు. రోహిత్ ఔటైన తర్వాత భారత వికెట్ల పతనం మొదలైంది. మిడిలార్డర్ బ్యాటర్లు ఒక్కరు కూడా రాణించలేకపోయారు. ఇషాన్ కిషన్(14), శ్రేయస్ అయ్యర్(0) వరుస ఓవర్లలో ఔటయ్యారు. దీంతో కావాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగిపోయింది. ఈ క్రమంలో కోహ్లి(74) కూడా ఓ భారీ షాట్‌కు ప్రయత్నించి పెవిలియన్‌కు చేరాడు. దీంతో మ్యాచ్ భారత్ చేతులనుంచి చేజారిపోయింది. కేఎల్ రాహుల్(12), అక్షర్ పటేల్(2) నిరాపరిచారు. ఫలితంగా టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 360 పరుగుల వద్ద ఆగిపోయింది. ఇంగ్లండ్ బౌలర్లలో సామ్ కుర్రాన్ 4 వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశాడు. కాగా ఇంగ్లండ్ టూర్‌లో భారత్ టీ20 సిరీస్‌తో పాటు వన్డే సిరీస్‌ను కూడా కోల్పోయి ఘోర పరాభవాన్ని మూట కట్టుకుంది.








# అమెరికా బాక్సర్ దుర్మరణం..!

అమెరికా మహిళల బాక్సింగ్‌లో రాణిస్తున్న హన్నా రాప్ (దుర్మరణం చెందింది. జూలై 18, శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 26 ఏళ్ల హన్నా కన్నుమూసింది. టెక్సాస్‌లో సైకిల్ తొక్కుతుండగా ఓ కారు ఆమెను బలంగా ఢీకొట్టింది. దాంతో, తీవ్రంగా గాయపడిన హన్నా ప్రాణాలు కోల్పోయింది. బాక్సర్ మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రాజోస్ కౌంటీ షెరిఫ్స్ ఆఫీస్ కథనం ప్రకారం.. ఉదయం 10 గంటల సమయంలో సైక్లింగ్ చేస్తున్న హన్నా రాప్‌ను కారు ఢీకొట్టింది. అతివేగంగా దూసుకొచ్చిన కారు.. ఇద్దరు సైక్లిస్టులను దాటి హన్నా సైకిల్‌ను తాకింది. ప్రమాదం తీవ్రతకు రక్తమోడిన బాక్సర్‌కు వెంటనే ప్రథమ చికిత్స అందించి ఆస్పత్రికి తీసకెళ్లారు. హాస్పిటల్లో చికిత్స పొందుతూ హన్నా ప్రాణాలు విడిచింది. కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. అమెరికాలో మహిళల బాక్సింగ్‌లో సంచలనంగా మారిన హన్నా రాప్ మృతితో స్థానికంగా విషాదం నెలకొంది. హన్నా అకాల మరణం పట్ల ప్రపంచ బాక్సింగ్ మండలి అధ్యక్షుడు మౌరిసియో సులైమన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. అమెరికా బాక్సింగ్‌లో హన్నా లోటును ఎవరూ పూడ్చలేరని పేర్కొన్నాడు. హన్నా అద్భుతమైన బక్సార్. అన్నికంటే ముఖ్యంగా.. తను మా బాక్సింగ్ కుటుంబంలో ఎంతో విలువైన సభ్యురాలు. ఆ విషాద సమయంలో హన్నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో కలిసి బాధను పంచుకుంటాం అని సులైమన్ వెల్లడించాడు.

# 'లార్డ్స్ ఐకానిక్ బెల్' కొట్టిన యువీ



భారత పురుషుల జట్టు మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ కు మరో గౌరవం లభించింది. ఒకప్పుడు మైదానంలో పరుగుల వరద పారించిన యువీ.. ఈసారి లార్డ్స్ స్టేడియంలోని 'ఐకానిక్ బెల్' ను మోగించాడు. భారత పురుషుల జట్టు మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ కు మరో గౌరవం లభించింది. ఒకప్పుడు మైదానంలో పరుగుల వరద పారించిన యువీ.. ఈసారి లార్డ్స్ స్టేడియంలోని 'ఐకానిక్ బెల్' ను మోగించాడు. భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో వన్డేను ఆరంభిస్తూ.. యువీ ఆ గంట కొట్టాడు. తద్వారా మొత్తంగా ఈ గౌరవం అందుకున్న భారత పదో క్రికెటర్‌గా యువరాజ్ గుర్తింపు సాధించాడు





# విశ్వవిజేతగా స్పెయిన్



ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులను ఉత్కంఠకు గురిచేస్తూ సాగిన 2026 ఫిఫా వరల్డ్ కప్‌కు ఆదివారం ఘన ముగింపు పలికింది. అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన ఫైనల్ పోరులో స్పెయిన్ అద్భుత పోరాట పటిమతో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను 1-0తో మట్టికరిపించి ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడింది. తొలి విజిల్ నుంచి చివరి క్షణం వరకు ఇరు జట్లు హోరాహోరీగా తలపడగా, స్పెయిన్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విజేతగా నిలిచింది. 2010లో తొలిసారి ప్రపంచకప్‌ను గెలిచిన స్పెయిన్, 16 ఏళ్ల విరామం తర్వాత మరోసారి ప్రపంచ విజేతగా అవతరించి తన ఫుట్‌బాల్ వారసత్వాన్ని మరింత బలోపేతం చేసింది. మరోవైపు వరుసగా రెండోసారి కప్‌ను కైవసం చేసుకోవాలన్న అర్జెంటీనా ఆశలు ఫైనల్లోనే ఆవిరయ్యాయి.



ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసిన 2026 ఫిఫా ప్రపంచకప్‌కు తెరపడింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో స్పెయిన్ చరిత్ర సృష్టించింది. అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన తుది సమరంలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను పెనాల్టీ షూటౌట్‌లో 5-4 తేడాతో ఓడించి ప్రపంచ విజేతగా అవతరించింది. నిర్ణీత 90 నిమిషాల ఆటతో పాటు అదనపు 30 నిమిషాలు ముగిసే వరకు ఇరు జట్లు ఒక్క గోల్ కూడా నమోదు చేయలేకపోయాయి. దీంతో విజేతను నిర్ణయించేందుకు మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు దారితీసింది. అక్కడ స్పెయిన్ ఆటగాళ్లు అసాధారణ ఆత్మవిశ్వాసంతో కిక్స్‌ను గోల్స్‌గా మలుస్తూ ట్రోఫీని సొంతం చేసుకున్నారు.



ఇది స్పెయిన్ ఫుట్‌బాల్ చరిత్రలో రెండో ప్రపంచకప్ టైటిల్. గతంలో 2010లో దక్షిణాఫ్రికాలో జరిగిన ప్రపంచకప్‌ను గెలుచుకున్న స్పెయిన్, 16 ఏళ్ల తర్వాత మరోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచి తన ఫుట్‌బాల్ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది. మరోవైపు 2022లో ప్రపంచకప్ గెలిచి డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనా వరుసగా రెండో టైటిల్ సాధించాలన్న ఆశ నెరవేరలేదు. ఫైనల్ మ్యాచ్ ప్రారంభం నుంచే ఇరు జట్లు అత్యంత జాగ్రత్తగా ఆడాయి. మధ్యమైదానంలో ఆధిపత్యం కోసం తీవ్ర పోటీ కనిపించింది. స్పెయిన్ బంతిపై ఎక్కువ నియంత్రణ సాధించేందుకు ప్రయత్నించగా, అర్జెంటీనా వేగవంతమైన కౌంటర్ అటాక్స్‌తో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టింది. అయితే ఇరు జట్ల గోల్‌కీపర్లు అద్భుతమైన సేవ్‌లు చేయడంతో గోల్ నమోదు కాలేదు. రక్షణ విభాగాలు కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. దీంతో నిర్ణీత సమయం 0-0తో ముగిసింది. అదనపు సమయంలోనూ పరిస్థితి మారలేదు. ఇరు జట్లు అవకాశాలు సృష్టించినప్పటికీ చివరి క్షణాల్లో ఫినిషింగ్ లోపించడం, గోల్‌కీపర్ల అద్భుత ప్రదర్శన కారణంగా స్కోరు మారలేదు. చివరకు ప్రపంచ విజేతను నిర్ణయించేందుకు పెనాల్టీ షూటౌట్ నిర్వహించారు. పెనాల్టీల్లో స్పెయిన్ ఆటగాళ్లు ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొన్నారు. వరుసగా కిక్స్‌ను గోల్స్‌గా మలుస్తూ ఆధిక్యంలో నిలిచారు. అర్జెంటీనా ఒక కీలక అవకాశం కోల్పోవడంతో స్పెయిన్ 5-4 తేడాతో విజయం సాధించింది. పెనాల్టీ విజయంతో స్పెయిన్ శిబిరంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఆటగాళ్లు, కోచ్‌లు, అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. ఈ ప్రపంచకప్ అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్త ఆతిథ్యంతో తొలిసారి మూడు దేశాల్లో నిర్వహించడం విశేషం. విస్తృత స్థాయిలో నిర్వహించిన ఈ టోర్నీలో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు మ్యాచ్‌లను వీక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భారీ స్టేడియాలు, అద్భుత నిర్వహణతో ఈ ప్రపంచకప్ ప్రత్యేక గుర్తింపు పొందింది. టోర్నీ మొత్తం స్పెయిన్ అత్యంత క్రమశిక్షణతో కూడిన ఆటతీరును ప్రదర్శించింది. బలమైన రక్షణ, సమన్వయంతో కూడిన పాస్‌లు, వేగవంతమైన దాడులతో ప్రత్యర్థులను నిలువరించింది. నాకౌట్ దశలోనూ స్థిరమైన ప్రదర్శన కనబరిచి ఫైనల్ చేరిన స్పెయిన్, చివరకు ట్రోఫీని ముద్దాడింది.

అర్జెంటీనా కూడా టోర్నీ అంతా పోరాట పటిమను కనబరిచింది. ప్రతి మ్యాచ్‌లో తమ అనుభవాన్ని చాటుకున్నప్పటికీ, ఫైనల్‌లో అదృష్టం కలిసిరాకపోవడంతో రన్నరప్‌గా సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ జట్టు ప్రదర్శన అభిమానుల ప్రశంసలు అందుకుంది. స్పెయిన్ విజయంతో దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. రాజధాని మాడ్రిడ్‌తో పాటు బార్సిలోనా, సెవిల్లే, వాలెన్సియా తదితర నగరాల్లో అభిమానులు వీధుల్లోకి వచ్చి జాతీయ జెండాలు ఊపుతూ వేడుకలు జరుపుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్పెయిన్ అభిమానులు కూడా తమ ఆనందాన్ని వివిధ కార్యక్రమాల ద్వారా పంచుకున్నారు. ఈ విజయంతో స్పెయిన్ మరోసారి ప్రపంచ ఫుట్‌బాల్‌లో అగ్రశ్రేణి జట్లలో ఒకటిగా తన స్థానాన్ని బలపరుచుకుంది. 2026 ప్రపంచకప్ విజయాన్ని దేశ ఫుట్‌బాల్ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా అభిమానులు కొనియాడుతున్నారు.

### చారిత్రాత్మక గోల్‌తో విజేతగా స్పెయిన్:

నిర్ణీత 90 నిమిషాల సమయంలో రెండు జట్లూ గోల్స్ చేయలేకపోవడంతో మ్యాచ్ అదనపు సమయానికి దారితీసింది. చివరకు మ్యాచ్ 106వ నిమిషంలో స్పెయిన్ స్ట్రైకర్ ఫెర్రాన్ టొర్రెస్ కొట్టిన వీరోచిత గోల్ ఆ జట్టును ప్రపంచ కప్ సింహాసనంపై కూర్చోబెట్టింది. లమిన్ యమల్, నికో విలియమ్స్ అందించిన అద్భుతమైన పాస్‌ను టొర్రెస్ గోల్‌గా మలిచిన తీరు ఈ శతాబ్దపు అత్యుత్తమ ఘట్టంగా నిలిచింది.



### మార్టినెజ్ వీరోచిత పోరాటం మరియు రికార్డు:

అర్జెంటీనా జట్టు టైటిల్‌ను నిలబెట్టుకోవడంలో విఫలమైనప్పటికీ, ఆ జట్టు గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్ ప్రదర్శన మాత్రం ఫుట్‌బాల్ చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. స్పెయిన్ ఆటగాళ్లు మ్యాచ్ మొదటి నిమిషం నుండే చేసిన భీకర దాడులను ఒంటరిగా తిప్పికొడుతూ అతను ఈ మ్యాచ్‌లో ఏకంగా 11 అద్భుతమైన సేవ్‌లు చేశాడు. ఒకే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇన్ని గోల్స్ కాపాడిన ఏకైక గోల్‌కీపర్‌గా మార్టినెజ్ సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు.



### రెడ్ కార్డ్ వివాదంతో అర్జెంటీనాకు దెబ్బ

ఈ ప్రతిష్టాత్మక ఫైనల్ మ్యాచ్ తీవ్ర వివాదాలకు కూడా వేదికైంది. మ్యాచ్ ముగింపు దశలో (92వ నిమిషంలో) అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ ఎంజో ఫెర్నాండెజ్ ప్రత్యర్థి ఆటగాడిపై ఘోరమైన ఫౌల్ చేయడంతో రెఫరీ అతనికి రెండో ఎల్లో కార్డ్ ఇచ్చి రెడ్ కార్డ్‌తో మైదానం వెలుపలికి పంపారు. 2010 తర్వాత ఒక ప్రపంచ కప్ ఫైనల్లో ఆటగాడికి రెడ్ కార్డ్ రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కీలకమైన అదనపు సమయంలో అర్జెంటీనా జట్టు 10 మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి రావడం ఆ జట్టు ఓటమికి ప్రధాన కారణమైంది.



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR**from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004